# దివ్యమంగళ రూపం

సర్వమంగళను మీరెప్పుడైనా చూశారా ? ఒకవేళ చూసి వుండకపోతే ముందెప్పుడైనా చూడగలరు. ఊరికే చూడటమేం ఖర్మ పరిచయం కూడా చేసుకో గలరు. ఆమె స్నేహం అనుభవంలోకి వచ్చినప్పుడు నన్ను తలుచుకోనూ గలరు.

సన్నగా, పొట్టిగా, నల్లగా ఉండే సర్వమంగళని నేను మొదటిసారిగా చూసి నప్పుడు చాలా ముచ్చటేసింది. ఆమెని చూడగానే ఆకర్షింపబడే విషయాలు రెండే రెండు. ఒకటి చురుకైన ఆమె కళ్ళు - రెండోది ఆమె మాట తీరు.

నన్నెవరో పరిచయం చెయ్యగానే నా చేతులు రెండూ పట్టుకుని ఎంతో ఆత్మీయంగా "నేను యిదే మొదటిసారి మిమ్మల్ని కలవడమైనా ఎప్పట్నుంచో ఎరుగునట్లుగా వుంది. ఎందుకో తెలుసా ? మీ రచనలన్నీ నాకు తెలుసు. అంటే మీరు నాకు తెలుసుననే కదా" అంది.

ఆమె చనువుకి, ప్రేమాభిమానాలకి ముగ్ధురాలినయ్యాను. "బహుశా జన్మ జన్మల బంధమంటే ఇదేనేమో" అంది కొసరుగా. చూశారా ! అప్పుడే మీకు నామీద

అనుమానం వచ్చేస్తోంది. నిజమే మరి - నాకీ క్షణంలో ఎంతో భయంగా వుంది. నేను చెప్పదల్చుకున్నది చెప్పగలనా ? చెప్పి మిమ్మల్ని ఒప్పించగలనా ?

నా ఊపిరి యిప్పుడు నన్ను ఇబ్బంది పెడుతూ, యిది రాస్తుంటే నా రక్తం ఉడుకెత్తుతోంది. ఈ అస్థిమితం నుండి తప్పించుకోడానికి తప్పకుండా మీకు సర్వ మంగళ గురించి చెప్తాను. నా శక్తినంతా ధారపోసి, నా ప్రాణాన్ని పణంగా పెట్టి యినా సరే మిమ్మల్ని ఒప్పించటానికి ప్రయత్నించుతాను.

*  *  *

ఆ రోజు సావిత్రి యింట్లో బొమ్మలు కొలువు పేరంటం. నిజానికి నేను పేరంటానికి వెళ్ళడానికి ఎక్కువగా యిష్టపడను. కారణం మరేం లేదు. ఓపిక చాలా తక్కువ. అయితే తప్పనిసరై ఆ రోజు సావిత్రింటికి వెళ్ళాను. అక్కడ హడావిడంతా మంగళదే ! ఎక్కడ చూసినా ఆమే ! ఏ పని చెయ్యాల్సివచ్చినా మంగళా ! మంగళా ! అంటూ సావిత్రి పిలుస్తూనే వుంది. 'సావిత్రికి మంగళ ఏమవు తుంది?' అని ఎవరికైనా అనుమానం వస్తే దానికి రెడీమేడ్ సమాధానం మంగళ దగ్గర వుంది.

"మన ఏమిటి ? పర ఏమిటి ? నా దృష్టిలో అందరూ ఒకటే. నాకందరూ కావల్సినవాళ్ళే, ఏదైనా మనం అనుకోవడంలోనే వుంటుంది" అంటుంది.

అది విన్న నేను ఆమెని అభినందించకుండా వుండలేక పోయాను.

పేరంటం మంచి జోరుగా సాగుతోంది. రంగు రంగుల చీరలు, రక రకాల నగలు, అందమైనవారూ, అందంగా కన్పించాలని ప్రయత్నిస్తున్న వాళ్ళూ, నిరంతరం తమ చీరల్నీ, నగల్నీ చూసుకుంటూ, వాళ్ళనీ, వీళ్ళనీ తన్నేస్తూ, తొక్కేస్తూ వున్నవాళ్ళు, సింపుల్‌గా లేతరంగు చీరతో, ఒంటిపేట గొలుసుతో నిరాడంబరంగా వున్నవాళ్ళూ, ఇలా - ఇలా అక్కడి వాతావరణం చూడముచ్చటగా వుంది.

సర్వమంగళ లాంటి వారెవరైనా అన్నీ చూసి పెట్టేవారుంటే యిలాంటి పేరంటం మనమూ ఒకటి చేయవచ్చు అనిపించింది. పేరంటం మన సంస్కృతికి అద్దం పట్టినట్టున్న మాట నిజం.

సరిగ్గా అప్పుడే వచ్చింది సరళ. నాకెంతో ఆత్మీయురాలు. చాలా హుందాగా వుంటుంది. ఆమెలోని నిజాయితీ, నిక్కచ్చితనం నాకెంతో యిష్టం.

నేనూ సరళా కబుర్లలో పడ్డాం. చుట్టు పక్కల వాళ్ళు కూడా మాతో

మాటలు కలుపుతున్నారు. ఎవరో ఓ సినిమా నటి గురించి మా మధ్య ప్రస్తావన వచ్చింది.

"అబ్బో! అదా! ఇప్పుడామె పందిలా వూరిపోయింది. చూడలేక ఛస్తున్నాం .... ఏం? సామాన్యంగా కాదు. ఇదిగో మన సరళలా అయిపోయింది" అంది మంగళ చటుక్కున ఒకరిద్దరు ఫక్కున నవ్వారు.

సరళ ముఖం నల్లగా మాడిపోవడం నేను గమనించాను. నా నోట మాట పడిపోయింది. పెదవి విప్పలేకపోయాను. మంగళ తన తప్పు గ్రహిస్తుందనుకున్నాను. కానీ అలాంటిదేమీ జరగలేదు. పైగా తనే పకపకా నవ్వేస్తూ ఏవో చలోక్తులు విసరడం మొదలుపెట్టింది. అప్పుడు నాకు మంగళలో మొదటిసారిగా లోపలా దాగి వున్న మరో మనిషి ఒక్కసారి దర్శనమిచ్చి మాయమైంది. నా మనసంతా దల్‌గా అయిపోయింది. సరళ బొద్దుగా, లావుగా వుంటుంది. అయితే మాత్రం ఎవర్నో పందిలా వూరిందనడమే తప్పు. పైగా ఎదురుగా ఉన్న మనిషిని చూపిస్తూ, ఆ మాటంటే - అక్కడామె పరిస్థితి ఏమిటి?

కొంతసేపయ్యాక నేనూరుకోలేక, "సారీ సరళా, నువ్వేం పట్టించుకోక" అన్నాను.

సరళ నవ్వింది. ఆమె కళ్ళల్లో ఏర్పడిన పలుచటి కన్నీటిపొర నన్నెంతో బాధించింది.

*　　　*　　　*

ఓ పదిరోజులు నా పనుల తొందరలో నేను ఎవ్వరినీ కలవలేదు. ఆ రోజు నా కథ ఒకటి అచ్చయిన పత్రిక నాకు పోస్ట్‌లో వచ్చింది. అచ్చులో పేరు చూసుకోవడంగానీ, రచన అచ్చవడంగానీ కొత్త కాకపోయినా ప్రతిసారీ ఒక స్వల్పమైన హృదయస్పందన ఉంటుంది. అయితే ఈసారి పడిన కథ కొత్త తరహాగా, కొత్త థీమ్‌తో రాసింది కావడంవల్ల అసలు కంటే కొంత ఎక్కువ తృప్తినే పొందాను. ఆ సాయంత్రం మంగళ నన్ను కలవడానికొచ్చింది.

వస్తూనే నా కథని గురించి ప్రస్తావించింది. నిజంగా నాకు ఆనందంతో బాటు కొంచెం పశ్చాత్తాపం కూడా కలిగింది. మంగళని నేను తొందరపాటుతో అపార్థం చేసుకున్నానా అనిపించింది.

ఒక అయిదు నిముషాలు మాట్లాడి "మీ కథ నేను పేజీల్లో ఉండగానే చూశాను" అంది.

"అంటే" అన్నాను ఆశ్చర్యంగా.

"ఆ పత్రికలో పనిచేసే శారద నా ఫ్రెండేగా, మొన్న వాళ్ళ ఆఫీసుకి వెళ్తే తన టేబుల్‌మీద తయారవుతున్న పత్రిక పేజీల్లో మీ కథ చూపించింది. ఏదో అక్కడక్కడ దిద్దవలసినవి వుంటే దిద్ది, చిన్న చిన్న మార్పులు చేసి వేశాను అంది మంగళ.

ఒక్కసారి నా తలమీద పిడుగు పడినంత షాక్ తిన్నాను. వెంటనే ఏం మాట్లాడాలో తెలీలేదు

"అదేమిటి ? నా కథ ఎవరో దిద్దడమేమిటి?" అన్నాను.

"అయినా ఆ శారదకి మహా గర్వం లెండి. అందరిపీ తనే సరి చేశా నంటుంది. అందర్నీ తనే పైకి తీసుకొచ్చాననంటుంది. ఏం ? ఒకవేళ ఏమైనా చిన్న చిన్న దిద్దుబాట్లు చేసిందే అనుకోండి. చెప్పుకోవాలా ? నేనేం వూరుకోలేదు లెండి. లెఫ్ట్ అండ్ రైట్ ఇచ్చాను.

అప్పటికే మంగళ మాటలు నాకు వినిపించటం మానేశాయి. నేను రాసిన కథ అక్షరం అక్షరం నాకు గుర్తే. చదువుకుని సంతృప్తిగా ఆనందపడిపోయాను. అచ్చు తప్పులు లేవని మురిసిపోయాను. కానీ ఇదేమిటి ? శారదని నేను రెండు మూడుసార్లు కలిశాను. నమ్రతగా ఎంతో మర్యాదగా వుంది. మరెందుకిలా మాట్లాడింది.

మంగళ కాస్సేపు కబుర్లు చెప్పి వెళ్ళిపోయింది. ఆ రాత్రంతా నాకు నిద్ర పట్టలేదు. ఒక్క అక్షరం కూడా మార్చకుండా ఏదో చేశానని ఎందుకు చెప్పింది ?

ఎలాగైనా విషయం తెలుసుకోవాలనే పట్టుదల పెరిగింది.

మూడోరోజున శారదని కలుసుకుందామని బయలుదేరాను. ఆమెనేదో అడిగి గొడవ చేద్దామనికాదు గానీ, ఆమె ధోరణి కనిపెడదామని.

ఆ పత్రికాఫీసులో అడుగుపెడుతుండగానే శారద సీటు ఖాళీగా నన్ను వెక్కిరించింది. పక్కసీట్లో సబ్ ఎడిటర్‌ని అడిగాను. "ఆమె విశాఖపట్నం ఎడిషన్‌కి ట్రాన్స్‌ఫరయి వెళ్ళిపోయారండీ" అని చెప్పాడు.

"ఎన్నాళ్ళయింది?"

"నెల్లాళ్ళయింది"

నా మనసు ఉక్రోషంతో కుత కుతలాడిపోయింది. చటుక్కున శ్రీశ్రీగారు రాసిన 'నేటి హిరణ్యాక్షుడు' కథ గుర్తుకొచ్చింది.

"నమశ్శివాయకి ఎదుటివారి మనశ్శాంతిని హరించటమే పని. కానీ అతనికి తెలీదు నా కసలు మనశ్శాంతే లేదని."

మహాకవి తనకి మనశ్శాంతే లేదని చమత్కరించినప్పటికీ ఆయన కూడా ఎంతో కొంత అశాంతికి గురై వుంటారన్నది నిజం.

నాకు మనశ్శాంతి పూర్తిగా పోయింది. ఒక భయంకరమైన ప్రవృత్తి మంగళలో వుందని గ్రహించాను. జాగ్రత్తగా వుండాలి అనుకున్నాను గానీ ఆ జాగ్రత్త ఎలాంటిదో కనిపెట్టలేకపోయాను.

మళ్ళీ చాలా రోజులకి ఒక రోజున అకస్మాత్తుగా వూడి పడింది. వస్తూనే 'మీకు ఆంజనేయులుగారు తెలుసటగా' అంది

"ఏ ఆంజనేయులుగారూ -" అన్నాను.

"అదే బాపట్ల" అంది.

"ఆయనా - తెలియకపోవడమేమిటి? బాగా పరిచయం వుంది. సుమారు ఇరవై ఏళ్ళుగా తెలుసు మేమిద్దరం సంగీత ప్రియులం. ఆయన దగ్గర అద్భుతమైన కలక్షన్ వుంది. ఎక్కడెక్కడి రికార్డులూ ఉన్నాయి. ఆ డిస్కులు ఆయనెంత జాగ్రత్తగా కాపాడుకుంటూ ఉంటారో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. మేం కూర్చుంటే గంటలు గంటలు గడిచిపోతాయి ఎంత చక్కని సంగీతం? ఎన్ని పాత పాటలు? ఎన్ని మంచి పాటలు? ఎక్కడెక్కడి కొత్త పాటలు సైగల్, కె.సి.డే, తలత్ మహ్మద్-పంకజ్ మల్లిక్, బడే గులాం అలీఖాన్, బేగం అఖ్తర్ ....అలా అలా పర్వీన్ సుల్తానా, మెహదీ హసన్, గులాం అలీ, లతామంగేష్కర్, ఘంటసాల....అబ్బ! ఎంత సేకరణో చెప్పలేను."

నిజానికి బడ బడ మాట్లాడకుండా వుండాల్సిందని మాటాడిన తర్వాత అనిపించింది.

"ఆంజనేయులుగారసగానే మీరింత చెప్పారే- ఆయనతో మాట్లాడుతుంటే "సుషమకి చాలా పొగరు. ప్రతిదానికీ వాదన పెట్టుకునేది. తెలిసింది కొంచెమైనా, ఆర్భాటం ఎక్కువ, యిప్పుడైనా మారిందా? అలాగే వుందా - అన్నారేమిటి" అంది మంగళ.

మంగళ గురించి తెలిసినా షాక్ తిన్నాను.

"నేను చెప్పాను లెండి. ఆమెకి పొగరంటే మీకు మహా పాపం వస్తుంది. అసలు మాటకూడా చాలా సున్నితం అని నేను పెద్దాయినకి బాగా అంటించాను" అంటూ ముగించింది మంగళ.

ఆంజనేయులుగారికీ, నాకూ కేవలం సంగీత పరంగా స్నేహం. ఆయన చాలా నిండైన మనిషి. మాటలు తక్కువగా మాట్లాడి పాటలు ఎక్కువగా వినే తపస్వి. ఆయనేమిటి నా గురించి యిలా మాట్లాడటమా?

నాకు తెలియకుండానే డల్లయిపోయాను.

"పోనిస్తురూ ? ఎవరేమనుకుంటే ఏమిటి ? మనమేమిటో మనకు తెలిస్తే చాలు-"

కొంత సేపు ఏవో అవీ యివీ మాట్లాడి వెళ్ళిపోయింది. నా మనసు కసితో రగిలిపోయింది.

నూటికి తొంభై మంది సర్వమంగళలు వుండకపోయినా వెయ్యికి ఒక్క రయినా వుంటారని ఖచ్చితంగా చెప్పగలను.పాముని పాముగా గుర్తించటం తేలిక గోవుని గోవుగా, పులిని పులిగా గుర్తించటం మరీ తేలిక గానీ, సర్వమంగళ దివ్య మంగళరూపం గ్రహించటం కొంచెం కష్టం. దానికి మీ మనశ్శాంతి, మీ అమాయ కత్వం ఖర్చు చెయ్యాల్సి వుంటుంది.

ఆ రోజు బాపట్ల ఘంటసాల అభిమాన సంఘం వారు పిలిస్తే సభలో మాట్లాడేందుకు బయలుదేరాను. మంగళ అర్థం అయ్యాక, ఆమె మాటలు మన సులో పెట్టుకుని ఆంజనేయులుగారిని కలవకపోవడం అర్థం లేని విషయం అని పించింది.

ఇంట్లో అడుగు పెడుతూంటేనే వాళ్ళబ్బాయి రవి ఎదురొచ్చాడు.

"బాగున్నావా? నాన్నగారున్నారా?" అని అడుగుతుండగానే గోడకు వేలాడు తున్న ఆంజనేయులుగారి పెద్ద ఫోటోకి వేసిన పూలదండ గాలికి వూగుతూ కని పించింది. నా గుండె ఝల్లుమంది.

"నాన్నగారూ...." అంటూ ఆగాడు రవి.

"అరే-నాకు తెలీదే-ఎప్పుడూ ?" అన్నాను ఆందోళనగా.

"మొన్న తొమ్మిదికి మూడు నెలలైందండి" అన్నాడు.

నా కళ్ళల్లో చటుక్కున నీరూరింది.

పది నిముషాలు మర్యాదకి కూర్చుని బయలుదేరి వచ్చేశాను.

"అమ్మా ! మంగళా ! నీ దివ్య మంగళ రూపం గ్రహించటం నాతరం కాదు" అని బయటకే గట్టిగా అనుకున్నాను.

సెప్టెంబరు '93 — (రచన)